


“నువ్వొఉత్త ఫూల్ వోయ్ కృష్ణా” అన్నది మా ఆవిడ, ఇల్లాలుగా పదవీ స్వీకారం చేయకముందు.

“ఔరా” అనుకుని బిత్తరపోయి చూస్తుండగా “నువ్వు ఇడియట్ వి” అన్నది నవ్వుతో ... నవ్వుతూనే మొగుణ్ని వాతలుపెట్టడం పెళ్లాల జన్మ హక్కు. అయితే మాలతి మా పెళ్లి కాకముందే నాపై ఆ హక్కు సంపాదించుకున్నది.

అందమైన అమ్మాయి వాలుచూపు కోసం, చిరునవ్వు కోసం తిప్పలుపడే వయస్సది. అప్పుడు మనకు ఇష్టమైన అమ్మాయి తిట్టినా కమ్మగానే వుంటుంది.

అసలు మాలతికి నేను మొగుణ్ని ఎలా అయినానన్నది – నాకే ఆశ్చర్యకరమైన విషయం. పెళ్లి అయిన తర్వాత ఫూల్ అనీ, ఇడియట్ అని కోప్పడలేదు.

“అబ్బ మీకేంతెలియదు, మీ రూరుకోండి” అని మెత్తగా నోరుమూయిస్తుంది. రెండిటి ఫోర్సు ఒకటే.

మేం వారానికోసారి బీచ్ లో కలుసుకునే వాళ్లం. ప్రేమించుకోవడం అనే

విశ్వాసం.. వర్శిటీ విద్యార్థుల విశ్వాసం. చీకటి పడాక. వెన్నెలలో. సముద్రపు హోరులో మాలతిని లీగల్‌గా ప్రేమించడం ప్రాక్టీస్ చేశాను.

అప్పుడే అలవాటైంది. మాలతి ఏ మాట అన్నా ఒప్పుకుని. నోరుమూసుకోవడం. ఆమె అనకపోతే ఎలావుండేదో గానీ, ఫూల్, ఇడియట్ అని ముద్దుగా పిలిచాక, నిజంగా ఫూల్‌నైనాను. కాకపోతే మాలతి మొగుణ్ణి ఎందుకవుతాను.

అసలు ఆ అమ్మాయి నాకు తెలీదు. వైజాగ్ కాలేజీలో ఇంటర్ చదివే అమ్మాయిని. యూనివర్శిటీలో ఎం. ఏ. చదివే నేను ఎందుకు ప్రేమిస్తాను? ఆ ఛాన్సు రావడానికి వీల్లేదుగదా! కానీ వచ్చింది అదే చిక్కు.

మాలతిని నేను డిస్కవర్ చేయలేదు. వాళ్ళ నాన్నగారే నన్ను డిస్కవర్ చేసి, నా గుణగణాలు డిస్సెక్ట్ చేసి, అవి వాళ్ళ అమ్మడిలోనూ, నాలోనూ సమ నిష్పత్తిలో ఉన్నాయని గుర్తించి, మేంయిద్దరం ఒకటైతే బాగుంటుందనే కనిష్ట సామాన్య గుణకారాలేవో వేసి, మానాన్నకు ఫిర్యాదు చేశాడు. ఆయనగారు నాకన్న ముందే ఆత్రంగా, నాకు తెలియకుండా, అజ్ఞాతంగా విశాఖపట్నం వచ్చి ఆ దేవదేవిని చూచి, ఉక్కిరిబిక్కిరై దరిమిలా నా గడికి వేంచేసి నన్ను ఉబ్బితబ్బిబ్బు చేసి, చివరకు నా చేత ఓ చిరునవ్వు చెక్కేశారు.

ఇంక మాలతిని ప్రేమించక తప్ప లేదు. అంటే అనవసరంగా ట్రయల్స్ వేసి, వెంటపడి, వ్యర్థ ప్రయత్నాలుచేసి, పళ్ళ గట్టిదనం పరీక్షించుకోకుండానే ప్రేమించే హక్కు అద్వాన్నంగా పొందాను.

నేను ఫలానా అని మాలతికి తెలుసు. తాను ఫలానా అని నాకు తెలుసు. మేమిద్దరం అలాగ తెలియనట్లే ఆదివారాలు, ఉంచనుగా సాయంత్రం సముద్రతీరంలో కలుసుకునే వాళ్ళం. అలాగా ట్రయల్ లవ్ ప్రారంభించి, నిజంగానే మాలతిని ప్రేమించేను.

నేను ఎక్కడ ఫూల్‌నైనానంటే మాలతిని అలా బీచ్‌లో కలుసుకుంటున్నప్పుడు ఒక రోజున అడిగాను. ఆ ఒక్క మాట నన్ను జీవితాంతం ఫూల్‌నిచేసింది. అది ఏమిటంటే,..

"మాలతీ! నువ్వు ఎవరినైనా ప్రేమించావా?" అని

ఆ మాటకు నావేపు తీవ్రంగా చూచి, తల దించుకుని ఆలస్యంగా ఓ చిరునవ్వు నవ్వి. "మీరు ఎవరినైనా ప్రేమించారా?" అని అడిగింది.

ఆ రోజుల్లో ప్రేమ తినే బ్రతుకుతున్నట్లుగదా... గర్వంగా 'ఓ' అన్నాను

"ఎవరిని?" అన్నది.

"మా క్లాసులో మెర్సీ అనే మెరుపు

అగ ఉంది. ఆ అమ్మాయిని" అన్నాను గర్వంగా.

నిజానికి మెర్సీకి, తనను నేను ప్రేమిస్తున్నట్లు తెలీదు. ఆ అమ్మాయి అందంగా ఉంటుందని, చలాకీగా ఉంటుందనీ ప్రేమిద్దామని అనుకున్నాను. అంతే.

అసలు ప్రపంచంలోని అందమైన ఆడవారందర్నీ ప్రేమించే హక్కు మనకున్నది. అంటే విద్యార్థుల కని తాత్పర్యం

"అయితే మిమ్మల్ని పెళ్లి చేసుకుంటాను" అన్నది మాలతి.

"మరి ప్రేమో !" అన్నాను.

"మెర్సీని ప్రేమించారుగా చాలదూ. నువ్వు ఉత్తఫూల్‌వి కృష్ణా" అన్నది.


ఒకమ్మాయిని ప్రేమిస్తున్నట్లు,మరొక అమ్మాయికి చస్తే చెప్పకూడదనే రహస్యం అప్పుడు నాకు తెలీదు. ఏ ఆడపిల్లా తను ఒకర్ని ప్రేమిస్తే, ఆవిషయం మరొక మగాడికి చస్తే చెప్పదట...చివరికి మొగుడికి కూడా. అసలు మొగుడ్ని ప్రేమిస్తున్న విషయమే ఆ మొగుడికి చెప్పరు ఆడపిల్లలు.

"నిన్ను ప్రేమిస్తున్నాను కృష్ణా" అని మాలతి ఏనాడూ నాకు చెప్పలేదు. అప్పటికీ, ఇప్పటికీ ... ఎప్పుడైనా. హుషారుగాఉండి 'ప్రేమ' సంగతి తెస్తే చాలు "ఫూల్, ఇడియట్" అంటుంది.

పెళ్లి అయిన తర్వాత, ప్రపంచంలో నా మాలతి అంత అందగత్తె మరెవరూ లేరనే నిర్ణయానికి వచ్చాను అలాగ ఎందుకు వచ్చానో, రాగలిగానో నాకే తెలీదు. పెళ్లి కాకముందు బోలెడుమంది అమ్మాయిలు మహా అందంగా, ఆకర్షణీయంగా కనిపించేవారు 'ఈ అమ్మాయిని పెళ్లి చేసుకుంటే బాగుండును' అనుకునేవాణ్ని అంతేగానీ "ఈ అమ్మాయిని ప్రేమించాలి" అనుకునేవాణ్ని కాదు. అదొక పెద్ద తప్పిదం. అందమైన అమ్మాయిని ప్రేమించాలిగానీ, పెళ్లాడాలని కోరకూడదు అని "ప్రేమగీత" బోధించింది రాధ. రాధ కథ వేరు

మాలతిని చూస్తుంటే, లోకంలోని అందగత్తెలందరూ ఆమెలోనే కన్పించేవారు అది ఆరోగ్యకరమైన విషయం. అలా అనిపించకపోతేనే చిక్కు. నీ పెళ్లాం అందగత్తె కాదని నీవు అనుకున్నావా, ఆమెతో సంసారంచేయలేవు ఆ విషయం ఆ ఇల్లాలికి తెలిసిందా నీ జీవితం నరకం అయితీరుతుంది.

ఇంతకీ మెర్సీ సంగతి చెప్పనేలేదు. నాలో మొట్టమొదట ప్రేమ మొలకెత్తింది మెర్సీని చూచాక. అదే నా ఫస్ట్ లవ్ ఎట్ ఫస్ట్ సైట్. ఆ గుమ్మను ఆపాదమస్తకం ప్రేమించాలనుకున్నాను. ప్రేమించాననుకున్నాను. ఆ చిట్టెమ్మ విల్సన్‌ను పెళ్లాడిందని తెలిసి, ఒకరోజు కాఫీ, సిగరెట్లు మానేసి, నిరసన సత్యాగ్రహం చేశాను రహస్యంగా. నా




ప్రేమను బయటపెట్టి లోపలే తొందరపడి, మరొక వెధవకు మనసిచ్చి, పెళ్లాడేసిన మెర్సీని క్షమించి మరచిపోయాను. తర్వాత మెర్సీ నాకు ఎదురుపడ్డా నా అస్తిత్వాన్ని, అనికినే గమనించనట్లు పోవడం చూచి ఆడవాళ్ళను, అందునా అందమైన కాలేజీ ఆడపిల్లల్ని ప్రేమించడమంత మతిమాలినపని మరొకటి లేదని తీర్మానం చేసుకుని, ఆ తీర్మానం మీద నేనే ఎన్నో పెద్ద సంతకాలు బరికేశాను

యవ్వనంలో కలిగే ప్రేమలో ఏదో తాపం ఉంటుంది నూటికి తొంభై తొమ్మిది యంగ్ ప్రేమాయణాలు బెడిసి కొడతాయి. కారణం నేను చెప్పలేను, మీరూ చెప్పలేరు. కనుక మెర్సీ పెళ్ళితో నేను దేవదాసును, మజ్నూను కాలేదు. 'కనీసం ఒక్కసారైనా నా ప్రేమను గురించి చెప్పి ఉండవలసిందని బాధపడ్డాను. చెబితే ఎలా వుండేదో!' 'హో. డియర్' అని నన్నే పెళ్ళాడేదేమోనని వెధవ ఆశ.

మాలతిని కౌగలించుకొని పడుకుని, "మాలా! నిన్ను ఎంతగా ప్రేమిస్తున్నానో తెలుసా" అన్నాను ఓసారి వెంటనే విదలించికొట్టి, దూరంగాపోయి "అలాటి మాటలు ఎప్పుడూ అనకండి. నాకు ప్రేమ, తేమ అనేవాళ్ళంటే చెడచిరాకు" అన్నది. అంటే మాలతి ఎవరినైనా ప్రేమించిందా! అడిగితే చంపేస్తుంది.

అలిగి పడుకునేవాణ్ని. మాలతి అయిదు విమిషాల తర్వాత వచ్చి ఊరడించి, లాలించి, మరిపించేది. ఆ వెచ్చని కౌగిలిలో ప్రపంచాన్ని, ప్రేమను మరచి పోయేవాణ్ని. పారవశ్యమే మిగిలేది.

మాలతిని చూస్తుంటే మిగిలినవారు జ్ఞాపకంరారు. మాలతిని పెళ్ళాడిన తర్వాత ఇతర స్త్రీలమీద కోరికే కలగడంలేదు. ఎంతటి దారుణం!

నా రెండవ అడ్వెంచర్ సులోచన తోటే. అదీ అట్టేదూరం పోలేదు. మాటలతో ఆగిపోయింది. మా ఇద్దరి కలయిక అనుకోకుండా జరిగింది. సులోచనకు నేనంటే యిష్టం. నా మాటలంటే ఇష్టం. ఆమె అప్సర. బంగారంవంటి శరీరం. పెద్ద కళ్లు. కార్లలో వచ్చేది. ఆమెకు నాతో కబుర్లాడడం యిష్టం. నాకు ఆమెను అనుభవించాలని కోరిక. కానీ ధైర్యంచేసి ఆమె చేయికూడా పట్టుకో లేకపోయాను. ఏమాత్రం ఛాన్స్ యిచ్చేది కాదు.

నా సులోచన కథకూడా మాలతికి చెప్పాను. అంతా విని ఫక్కున నవ్వింది.

"ఎందుకు నవ్వుతావు మాలతీ" అంటే.

"పాపం...పసివారు" అని మళ్లీ నవ్వింది.

ఇంక ఎప్పుడూ మాలతికి నా ప్రేమ గురించి చెప్పకూడదని ఒట్టు వేసుకున్నాను.

మాలతి అందంముందు సులోచన ఎందుకూ కొరగాదని ఆ రాత్రి గ్రహించాను. నా అవసరాలు గ్రహించగలదు మాలతి. సులోచనకు ఆ జ్ఞానం లేదు. ఆపాటి జ్ఞానమేవుంటే యిన్నాళ్ళు దూరంగా ఉంచుతుందా!

ప్రేమ విషయాలలో నేను వట్టి వెధవనని మా ఆవిడ గ్రహించింది. పైకి ఆమాటనే 'ధ్వనించేటట్లు' వ్యంగ్యంగా విసిరేది.

అసలు తిరుగుడు అంతా రాధను ప్రేమించినప్పుడు. రాధ సెలయేటి కెరటంలాగ గలగలా నవ్వేది. పారే వాగులా తీవ్రంగా ఉండేది మాలతికి రాధకు చాలా పోలికలున్నాయి. మాలతిని పెండ్లి చేసుకొనకముందే రాధను ప్రేమించాను. ఆమెను చూడకపోతే బ్రతకలేననిపించేది.

ఒకరోజు ఎదురుపడి అడిగాను "రాధా! నన్ను పెళ్ళాడవూ?" అని.

రాధ గమ్మత్తుగా చూచింది.

"ఏం నేనంత అసహ్యంగా ఉన్నానా?" అంది...

"నువ్వు అప్సరసవు, రంభవు..." అన్నాను...

"రంభను, అప్సరసను పెళ్ళాడాలని ఎవరూ అనుకోరు... ప్రేమిస్తారు...




అందమైన అమ్మాయినిచూచి ప్రేమించ లేనివాడు..." ఏదో అనబోయింది.

"నిన్ను ప్రేమిస్తున్నాను రాధా... అందుకే పెళ్లాడదలిచాను" భయపడుతూ అన్నాను.

"నాన్సెన్స్... పెళ్ళి... పెళ్ళి అనే వాళ్ళను చూస్తే నాకు చిరాకు. ప్రేమిస్తానంటావ్ నాకేం అభ్యంతరం లేదు. కానీ నువ్వు ముందు ప్రేమమాట చెప్పలేదు కనుక ఇంక నువ్వు ప్రేమిస్తానన్నా ఒప్పుకోను. అందమైన అమ్మాయి దొరికితే ప్రేమించుగానీ, పెళ్ళి బేరం చేయకు మిస్టర్. ప్రమాదం" అని వార్నింగిచ్చింది రాధ.

నా తల తిరిగిపోయింది. తల బొప్పి కట్టింది. ఈ విషయంమాత్రం మాలతికి చెప్పలేదు. చెప్పనుకూడా.

'ఈసారి బ్రూట్' అని తిట్టగలదు. ఈ కథలన్నీ విశాఖపట్నంలో ఉన్నప్పుడు.

దరిమిలా నేను సినిమాలను ఉద్ధరించాలనే సంకల్పంతో మద్రాసు రావడంతో సంసారం మద్రాసుకు ట్రాన్స్ఫర్ అయింది. సినిమావాళ్ళకు స్త్రీ జనంతో చనువు ఎక్కువని అందరికీ తెలిసినంత మా ఆవిడకూ తెలుసు. చాలా మంది అందమైన భామలు నాకోసం వచ్చేవారు. కొందరు సినిమాలలో వేషాలకోసం వచ్చేవారు. నాటకాల అమ్మాయిలు కొందరు ఏమైతేనే. సీతాకోక చిలకలు చాలా మా యింట్లో వాలుతుంటాయి వాళ్ళతో స్నేహంగానూ, చొరవగానూ ఉండక తప్పదు

మాలతికి నామీద గొప్ప నమ్మకం.

వచ్చినా, నేను చలించనని. అంటే అంతటి నిగ్రహం ఉన్నదని ఆమె నమ్మకమూ ! కాదు. నాకు అంత ధైర్యం లేదని ఆవిడ ధైర్యం.

మాలతికి అన్యాయం చేయాలని నేను ఏనాడూ అనుకోలేదు, నిజానికి పరస్త్రీని నేను చూడలేదు. చూడలేదంటే చూడ లేదనిగాదు, ఎవరితోనూ సంబంధం పెట్టుకోలేదు. నాకు మాలతిని మించిన అందం ఎవరిలోనూ కనిపించదు

కాని మొన్న ఏం జరిగిందంటే మా ఆవిడ బంధువుల యింటికని వెళ్ళింది. ఆదివారం కావడంవల్ల నేను యింట్లోనే వున్నాను. మాలతి వెళ్ళిన కాసేపటికి ప్రమీలారాణి వచ్చింది. ప్రమీలారాణి ఇప్పుడిప్పుడే సినీమాతారగా స్థిరపడు తున్నది. నాద్వారా నాలుగు కంపెనీలలో వేషాలు వచ్చాయి. ఆ అమ్మాయికి ఆ విశ్వాసం ఉన్నది నాపైన.

ఆ అమ్మాయికి ఓ హిందీపిక్చర్‌లో హీరోయిన్ ఛాన్స్ వచ్చిందట. ఆ విషయం చెప్పడానికే వచ్చింది

మా ఆవిడ యింట్లో లేకపోవడంతో కొద్ది చనువు తీసుకొంది. సంతోషంతో వచ్చి నన్ను కౌగిలించుకొని, ముద్దు పెట్టు కుంది. అనుకోకుండా వచ్చిన ఆ పొంగుకు నిగ్రహించుకోలేక, నాచేతులు ఆమెనడుం చుట్టాయి. ఆమెచేతులు నా మెడచుట్టూ వేసింది. పరిష్వంగం కాస్త వేడిగానే ఉంది.

ఆ క్షణంలోనే వచ్చింది. తలుపులు తీసే ఉండడంతో కొంప మునిగింది. ఆ దృశ్యం చూచింది మాలతి.

ఆ రాత్రే పుట్టింటికి ప్రయాణమైంది. ఆమెకు ఎలా నచ్చచెప్పాలో నా కర్థం కాలేదు. పరస్త్రీని కన్నెత్తి చూడననే నమ్మకం ఉన్న మాలతి, ప్రమీలారాణి కౌగిలిలో నన్ను చూచింది. క్షమించ మంటే !

"మాలతీ ! నేను నిజంగా ఏ పాపం ఎరగను... నన్ను నమ్మవూ"

ఆ రాత్రి దిగులుగా పడుకున్నాను ఒంటరిగా. మాలతి సత్యభామ అయి. అలకపాన్పు ఎక్కిందని తెలుసు. మామూలుగా వచ్చి, ప్రక్కన చేరింది.

"ఆ అమ్మాయికూడా మిమ్మల్ని ఫూల్ చేసింది" అన్నది. చీకటిలో మాలతి కళ్ళలో ఎప్పటి మెరుపు కని పించింది. ఆ శరీరంలో ఎప్పటి వేడి ఉన్నది.

"ఏం" అన్నాను.

"మీకు పరాయి ఆడవాళ్ళను ప్రేమిం చడ తెలియదు. అందుకని" అన్నది.

ఆమె పెదాలు తమకంతో అందుకో బోయాను...

"నోరు శుభ్రంగా కడుక్కున్నారా, లేదా" అన్నది కిలకిలా నవ్వుతూ...

"అంటే నాకర్థంకాలేదు. అంతేగాదు, మాలతి కౌగిలిలో లిగిన మత్తు, ప్రమీల కౌగిలిలో కలగలేదెందుచేత?"